సాక్షి

పార్వతీపురం మన్యం

సోమవారం । 20 । ఫిబ్రవరి । 2023



పుణ్యగిరిపై భక్తసిరి

పుణ్యగిరి క్షేత్రంలో శనివారం తెల్లవారుజామున ప్రారంభమైన దర్శనాలు ఆదివారం సాయంత్రం వరకూ నిరంతరాయంగా కొనసాగాయి.

- 8లో



షటిల్ విజేత ఎస్.కోట

ఉత్తరాంధ్ర స్థాయిలో నిర్వహించిన షటిల్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది.

- 8లో



ముగిసిన ఉత్సవాలు

సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలో మహాశివ రాత్రి ఉత్సవాలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి.

- 8లో

న్యూస్‌రీల్

ప్రత్యేక ఇంటర్వ్యూలు

పాలకొండ రూరల్: నిరుద్యోగ యువతకు ఉపాధి మార్గాలు కల్పించే క్రమంలో స్థానిక తమ్మినాయుడు విద్యా సంస్థల నేతృత్వంలో ఈ నెల 21వ తేదీన ప్రత్యేక ఇంటర్వ్యూలు జరగనున్నాయి. ఈ మేరకు విద్యా సంస్థల ప్రిన్స్‌పాల్ ఎ.తిరుపతిరావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్కిల్ కనెక్ట్ డ్రైవ్ హెట్రో డ్రగ్ ఫార్మసీ కంపెనీలో ఉద్యోగ అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. బీఏ, బీకామ్, బీఎస్సీ పూర్తి చేసిన 18 నుంచి 25 ఏళ్ల గల యువకులు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 91823 98325 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నేడు రామతీర్థంలో హుండీల ఆదాయం లెక్కింపు

నెల్లిమర్ల రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీసీతారామస్వామి దేవస్థానంలో సోమవారం హుండీల ఆదాయం లెక్కించనున్నట్టు ఈఓ ప్రసాదరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవదాయ శాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ఉదయం 9గంటల నుంచి లెక్కింపు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. స్వామి వారి తిరుక్కల్యాణ, రథయాత్ర, మహాశివరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని ఆదాయాన్ని లెక్కిస్తున్నామని, వివిధ ప్రాంతాలకు చెందిన శ్రీవారి సేవా భక్తులు పాల్గొంటారని పేర్కొన్నారు.

అమ్మవారి జాతర పోస్టర్ల ఆవిష్కరణ

- వేడుకగా కనకమహాలక్ష్మి అమ్మవారి 25వ జాతర
- రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

చీపురుపల్లి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి 25వ జాతర మహోత్సవాలను వేడుకగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని దేవస్థానం కమిటీకి రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సూచించారు. ఈ నెల 26, 27, 28 తేదీల్లో జరగనున్న శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర మహోత్సవాల వాల్‌పోస్టర్లను ఆదివారం మంత్రి బొత్స నివాసంలో ఆలయ కమిటీ, వైఎస్సార్‌సీపీ మండల నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే అమ్మవారి జాతరను వేడుకగా నిర్వహించాలన్నారు. జాతరలో అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. దేవస్థానం వద్ద క్యూలైన్లు, తాగునీటి సరఫరా, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, దేవస్థానం కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్, సభ్యులు అద్దూరి సీతబాబు, వంకల కృష్ణ, అడ్డాల రవి, ప్రభాత్, కనకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎస్‌ఐ ఉద్యోగ నియామకాల రాత పరీక్ష

- పది పరీక్ష కేంద్రాల్లో 8458 మంది అభ్యర్థులకు ఏర్పాట్లు
- పర్యవేక్షించిన విశాఖ రేంజ్ డీఐజీ హరికృష్ణ



సీతం కళాశాల వద్ద భద్రతా ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ

విజయనగరం క్రైమ్: ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవెల్ పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో ఎస్‌ఐ ఉద్యోగ నియామకాలకు పది పరీక్ష కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన ప్రాథమిక రాత పరీక్ష పటిష్టమైన భద్రత నడుమ ప్రశాంతంగా ముగిసింది. ఎస్పీ ఎం.దీపిక పరీక్ష కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే అభ్యర్థులకు ఉచితంగా జేఎన్‌టీయూ వద్ద రెండు బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం పరీక్ష కేంద్రాల వద్ద అభ్యర్థుల హాల్ టికెట్లు, గుర్తింపు కార్డులు పరిశీలించారు. జిల్లాలో పది పరీక్ష కేంద్రాల్లో 8458 మంది అభ్యర్థులకుగానూ పేపర్ – 1కి 7744 మంది, పేపర్ – 2కి 7741 మంది అభ్యర్థులు హాజరయ్యారని ఎస్పీ తెలిపారు.

పరీక్ష కేంద్రాలను పరిశీలించిన డీఐజీ

జేఎన్‌టీయూ, లెండి కళాశాలల్లో నిర్వహించిన పరీక్షలను విశాఖ రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ ఆదివారం సందర్శించి, పరీక్ష కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. పది పరీక్ష కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను ఎస్పీ దీపిక, డీఐజీకి వివరించారు. వీరి వెంట డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, పలువురు సీఐలు, ఎస్‌ఐలు ఉన్నారు.

వైద్యశాలలకు కొత్త కళ

- జిల్లాలో మారుతున్న ఆస్పత్రుల రూపురేఖలు
- నాడు – నేడు పథకం కింద పనులు
- జిల్లాలో రెండు మల్టీస్పెషాల్టీ ఆస్పత్రులకు రూ.98.58కోట్లు
- సీహెచ్‌సీల అభివృద్ధికి రూ.28.95కోట్లు
- జిల్లా ఆస్పత్రి పడకల పెంపునకు రూ.21.15కోట్లు
- సీతంపేట ఏరియా ఆస్పత్రి అభివృద్ధికి రూ.19.07కోట్లు

రాష్ట్రంలోని జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాడు – నేడు కింద సకల సదుపాయాలు కల్పిస్తోంది. పీహెచ్‌సీల నుంచి జిల్లా ఆస్పత్రుల రూపురేఖలనే మార్చేస్తోంది. దీంతో రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందనున్నాయి.

ఆస్పత్రుల్లో పడకల పెంపు, కేటాయించిన నిధులు

ఆస్పత్రి	పడకల పెంపు	నిధులు
సాలూరు ఏరియా ఆస్పత్రి	30 నుంచి 100	రూ. 17 కోట్లు
కురుపాం సీహెచ్‌సీ	30 నుంచి 50	రూ. 3 కోట్లు
భద్రగిరి సీహెచ్‌సీ	30 నుంచి 50	రూ. 8.95 కోట్లు
సీతంపేట ఏరియా ఆస్పత్రి	30 నుంచి 100	రూ. 19.07 కోట్లు
పార్వతీపురం జిల్లా ఆస్పత్రి	100 నుంచి 150	రూ. 21.15 కోట్లు



నిర్మాణంలో ఉన్న పార్వతీపురం యూపీహెచ్‌సీ



నిర్మాణంలో ఉన్న సీతంపేట ఏరియా ఆస్పత్రి

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రభుత్వ వైద్యశాలల రూపురేఖలు మారుతున్నాయి. జిల్లాకు బోధనాస్పత్రి, సాలూరు, పాలకొండ, సీతంపేటలో ఏరియా ఆస్పత్రులు ఉన్నాయి. వీటితో పాటు మరో మూడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు(సీహెచ్‌సీలు), 37ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 5 అర్బన్ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. ఆస్పత్రుల్లో పాడైన ప్రతి భవనాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆధునికీకరిస్తోంది. ఇందులో భాగంగా నాడు – నేడు కింద కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల రూపురేఖలు మారుస్తోంది. ఇందు కోసం రూ.వందల కోట్లను ఖర్చు చేస్తోంది. నూతన భవనాల్లో ఇప్పటికే సగం పూర్తయ్యాయి. మరో సగం ఆరు నెలల్లోపు పూర్తి కానున్నాయి.

అన్ని రకాల వైద్య సేవలు

కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో ఒక గైనకాలజిస్టు, ఒక పీడియాట్రిస్ట్, ఒక అనస్తషియా, ఒక జనరల్ మెడిసిన్, ఒక జనరల్ సర్జన్, ఇద్దరు సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్థాయి వైద్యులు ఉంటారు. వీరితో పాటు నర్సులు, ఇతర సిబ్బంది కలిపి ప్రతి సీహెచ్‌సీలో 31 మంది వరకు పోస్టులు మంజూరయ్యాయి. జిల్లాలో అన్ని చోట్ల వైద్యం సమయానికి అందుతోంది. ఆయా ఆస్పత్రుల పరిధిలో సాధారణ, సిజేరియన్ ప్రసవాలతో పాటు రోడ్డు ప్రమాదాలు, ఇతర ప్రమాదాల్లో గాయపడిన వారికి చికిత్స చేయడంతో పాటు అత్యవసర వైద్యాన్ని కూడా అందించేందుకు వైద్యులను నియమించారు. ఈ మేరకు ఆయా సీహెచ్‌సీ భవనాల్లో మౌలిక వసతులు, సదుపాయాలు కల్పిస్తున్నారు. పెద్ద పెద్ద జబ్బులకు మాత్రమే జిల్లా ఆస్పత్రులకు రోగులను రిఫర్ చేసేందుకు విధంగా వైద్యులను తీర్చిదిద్దుతున్నారు. మరో మూడు నుంచి ఆరు నెలల్లో మొత్తం సీహెచ్‌సీల్లో పూర్తి స్థాయి వైద్యసేవలను అందు బాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో ఆస్పత్రుల అభివృద్ధికి రూ.28.95కోట్లు కేటాయించింది.

ఏరియా, జిల్లా ఆస్పత్రుల్లో పడకల పెంపు

జిల్లా, ఏరియా ఆస్పత్రుల్లో అధునాతన వైద్యసేవలు అందిస్తుంది. వైద్య పరీక్షలు నిమిత్తం వేరే ప్రాంతానికి వెళ్లకుండా ఆధునిక ల్యాబ్ పరికరాలతో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా పడకల సంఖ్యను పెంచి మరింత ఎక్కువ మందికి వైద్య సేవలు అందించేందుకు చర్యలు చేపట్టారు. పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో రూ.21.15 కోట్లతో 100 నుంచి 150 పడకలు పెంచారు. సీతంపేట ఏరియా ఆస్పత్రిలో రూ. 19.07 కోట్లతో 30 నుంచి 100 పడకలు పెంచుతూ నూతన భవనాన్ని నిర్మిస్తున్నారు.

రూ.98.58కోట్లతో జిల్లాకు రెండు మల్టీ స్పెషాల్టీ ఆస్పత్రులు

ఒకప్పుడు గిరిజన ప్రాంత ప్రజలు మెరుగైన వైద్యం కావాలంటే ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని సుదూర ప్రాంతాలకు వెళ్లే పరిస్థితి ఉండేది. గిరిజనులెవరూ వైద్యం అందక ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో నూతనంగా ఏర్పడిన మన్యం జిల్లాలో మెరుగైన వైద్యసేవలు అందించాలనే సదుద్దేశంతో జిల్లాకు రెండు మల్టీస్పెషాల్టీ ఆస్పత్రులను మంజూరు చేశారు. గిరిజన గ్రామాలకు కేంద్రాలైన పార్వతీపురం, సీతంపేటలో ఒక్కో ఆస్పత్రికి రూ. 49.29 చొప్పున రెండింటికి రూ. 98.58 కోట్లను మంజూరు చేశారు.

ఆస్పత్రి భవనాల్లో సగం పూర్తి

జిల్లాలో ఏరియా ఆస్పత్రులు, 3 సీహెచ్‌సీలకు కొత్త భవనాలు నిర్మిస్తున్నాం. ఇందులో ఇప్పటికే సగం పూర్తయ్యాయి. మిగిలిన పనులు మూడు నుంచి ఆరు నెలల్లో పూర్తవుతాయి. భవనాలతో పాటు అందులో మౌలిక సదుపాయాలు, సౌకర్యాలు కూడా అందుబాటులోకి వస్తాయి. రోగులకు పూర్తి స్థాయి వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

– సత్య ప్రభాకర్, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ, పార్వతీపురం మన్యం జిల్లా

మరింత మెరుగైన వైద్యసేవలు



ప్రస్తుతం సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రుల్లో రోగులకు మంచి సేవలు అందుతున్నాయి. దీంతో పాటు కొత్త భవనాలు, సౌకర్యాలు అందుబాటులోకి వస్తే రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నాడు – నేడు కార్యక్రమంలో భాగంగా శరవేగంగా చర్యలు చేపడుతోంది. నూతన భవనాల నిర్మాణాలు పూర్తయితే నియోజకవర్గ స్థాయిలోనే పెద్ద ఆస్పత్రుల్లో అవే సేవలు ఇక్కడే అందే అవకాశం ఉంది.

– డా.బి.వాగ్దేవి, డీసీహెచ్‌ఎస్, పార్వతీపురం మన్యం జిల్లా

లావాదేవీల లక్ష్యం రూ.2వేల కోట్లు

- డీసీసీబీ సీఈఓ జనార్దన



వేపాడలో డీసీసీబీ శాఖ ఏర్పాటుకు అద్దె భవనాన్ని పరిశీలించి కొలతలు వేయిస్తున్న సీఈఓ, డీసీసీబీ చైర్మన్ చినరామునాయుడు

వేపాడ: జిల్లాలో మార్చి నాటికి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పరిధిలో రూ.రెండు వేల కోట్ల లావాదేవీలు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని డీసీసీబీ ముఖ్య కార్య నిర్వాహణాధికారి కె.జనార్దన తెలిపారు. డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు ఆధ్వర్యంలో వేపాడలో సెంట్రల్ బ్యాంకు ఏర్పాటుకు వల్లంపూడిలో అద్దె భవనాన్ని పరిశీలించేందుకు ఆదివారం వచ్చిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో వేపాడ, మెరకముడిదాం, దత్తిరాజేరు, భోగాపురం, మెంటాడ మండలం చల్లపేట, మన్యం జిల్లాలోని గరుగుబిల్లిలో కొత్త శాఖలు ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. వీటిలో ఇప్పటికే మెరకముడిదాం, మెంటాడ మండలం చల్లపేట, దత్తిరాజేరులలో బ్రాంచ్‌లు ఏర్పాటుకు అవసరమైన అద్దె భవనాలు సేకరించినట్టు చెప్పారు. చల్లపేట గ్రామస్తులు 15 సెంట్లు స్థలం ఇచ్చినందున తాత్కాలికంగా అద్దె భవనంలో ప్రారంభించనున్నట్టు తెలిపారు. వేపాడలో బ్రాంచి ప్రారంభించేందుకు అవసరమైన భవనాన్ని వల్లంపూడిలో కిసాన్ సీడ్ భవనంపైన పరిశీలించి కొలత లు సేకరిస్తున్నామన్నారు. ఇతర బ్యాంకుల మాదిరి సెంట్రల్ బ్యాంకులో ఎటువంటి సేవా రుసుం లేకుండా సేవలు అందిస్తున్నామని తెలిపారు. సహకార నిధి పేరుతో 999 రోజులకు సాధారణ వ్యక్తులకు 8 శాతం, సీనియర్ సిటిజన్లకు 8.25 శాతం వడ్డీతో చెల్లిస్తున్నట్టు పేర్కొన్నారు. పంట రుణాలకు రూ.3లక్షల లోపు 7 శాతం, రూ.3 నుంచి 5 లక్షల వరకు 8 శాతం, రూ.5 లక్షలు పైబడి తీసుకున్న రుణానికి 9 శాతం వడ్డీతో రుణాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా సెంట్రల్ బ్యాంకు ఏజీఎం లక్ష్మణరావు, ఇంజినీరింగ్ అధికారి శ్రీనివాసరావు, చినగుడిపాల సర్పంచ్ రాముునాయుడు తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో సీబీఎస్‌ఈ బోధన



సీబీఎస్‌ఈ పాఠ్య పుస్తకాలతో వీరఘట్టం కేజీబీవీలో చదువుతున్న బాలికలు

- వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభానికి సన్నాహాలు
- తొలి విడత జిల్లాలో 244 పాఠశాలల ఎంపిక
- పార్వతీపురం మన్యం జిల్లాలో మొత్తం ప్రభుత్వ పాఠశాలలు : 1,532

ప్రపంచ స్థాయిలో రాష్ట్ర విద్యార్థులు రాణించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించి అమలుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సీబీఎస్‌ఈ పాఠ్య ప్రణాళికలను ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల్లో బోధించేలా చర్యలు తీసుకుంది.

వీరఘట్టం: వచ్చే విద్యా సంవత్సరం నుంచి సర్కారు పాఠశాలల్లో సీబీఎస్‌ఈ (సెంటల్ బోర్డు సెకండరీ ఎడ్యుకేషన్) అమలుకు సన్నాహాలు చేస్తున్నారు. బోర్డు అనుమతుల కోసం సమగ్ర వివరాలన్ని ఇప్పటికే పంపించారు. సీబీఎస్‌ఈ సంస్థ నుంచి అన్ని రకాల అనుమతులు లభిస్తే వెంటనే కార్యాచరణ సిద్ధం చేయాలని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు నూతన విధానంలో బోధనపై శిక్షణ పొందారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు ప్రయోగాత్మకంగా సీబీఎస్‌ఈ సిలబస్‌తోనే పాఠాలు ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచే బోధిస్తున్నారు.

జిల్లాలో 1532 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా వీటిల్లో 244 పాఠశాలల్లో తొలి విడతలో సీబీఎస్‌ఈ అమలుకు చర్యలు తీసుకున్నారు. 2024 – 25లో పదో తరగతి పరీక్షలన్నీ ఈ విధానంలో రాయించాలని సన్నద్ధం చేస్తున్నారు. తొమ్మిదో తరగతికి ప్రవేశాలు నిర్వహించే విధానం, రిజిస్ట్రేషన్లు, విద్యార్థుల పరీక్ష విధానం, మూల్యాంకనం తదితర అంశాలపై ఇటీవలే శిక్షణ ఇచ్చారు. ఏటా బోర్డు నుంచి గుర్తింపు పొందే విధానం, పోర్టల్స్ నవీకరణ ఎలా చేయాలి... పాఠశాలలు అకడమిక్ పరంగా పొందే సహకారం, విద్యార్థులు చదవాల్సిన పాఠ్యాంశాలు, ఎన్‌ఈపీలో భాగంగా నైపుణ్యం, వృత్తి విద్యను నిర్వహించే పద్ధతులు, ఉపాధ్యాయులకు మాడ్యూల్స్ ఉపయోగించడంపై అవగాహన కల్పించారు.

8వ తరగతి విద్యార్థులకు పాఠ్యాంశాల బోధన

జిల్లాలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో 22 వేల మంది విద్యార్థులు ఎనిమిదో తరగతి చదువుతున్నారు. వీరికి ట్యాబ్‌లను పంపిణీ చేశారు. బైజూస్ పాఠాలతో పాటు సీబీఎస్‌ఈ పుస్తకాలతో అన్ని పాఠశాలల్లో బోధన చేస్తున్నారు. జాతీయ విద్య, పరిశోధన మండలి (ఎన్‌సీఆర్‌టీ) పాఠ్య పుస్తకాలను సీబీఎస్‌ఈ అనుసరిస్తుంది. ఈ ఏడాది ఎనిమిదో తరగతికి ఇదే సిలబస్ ఆధారంగా రూపొందించిన పుస్తకాలే ఇచ్చారు. 1 నుంచి 7వ తరగతి విద్యార్థులకు కూడా అదే విధానంలో పుస్తకాలు రూపకల్పన చేయనున్నారు. గణితం, ఆంగ్లం, సైన్సు పాఠ్యాంశాలకు సంబంధించి కొత్త పుస్తకాలు ఇస్తారు. సాంఘికశాస్త్రం రాష్ట్ర సిలబస్‌లోనే ఉంటుంది.

ప్రపంచ స్థాయిలో రాణించాలనేదే లక్ష్యం



సీబీఎస్‌ఈ బోధనతో ప్రపంచ స్థాయిలో మన విద్యార్థులు రాణించేందుకు అవకాశాలు మెరుగ్గా ఉంటాయి. ఈ లక్ష్యంతోనే జిల్లాలో 244 పాఠశాలల్లో సీబీఎస్ఈ బోధనను చేపట్టనున్నాం. ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఇప్పటికే పాఠాల బోధన జరుగుతోంది. 2024 – 25 విద్యా సంవత్సరంలో ఈ విధానంలో పదో తరగతి పరీక్షలన్నీ మన విద్యార్థులు కూడా రాసేలా చర్యలు తీసుకుంటున్నాం.

– ఎస్‌డీవీ రమణ, డీఈఓ, పార్వతీపురం మన్యం జిల్లా

చెరుకు తోటలో గజరాజులు



వీరఘట్టం: చెరుకు తోటలో ఉన్న ఏనుగుల కదలికలను పరిశీలిస్తున్న ట్రాకర్లు

వీరఘట్టం: చుట్టూ మొక్కజొన్న, కాయగూరల పంటలు... వాటి మధ్యలో ఉన్న చెరుకు తోటలో తిష్ట వేసిన ఏనుగులతో రైతులు పొలాలకు వెళ్లేందుకు భయాందోళన చెందుతున్నారు. వీరఘట్టం మండలం కిమ్మి, నడుకూరు, వీరఘట్టం, కొట్టుగుమ్మడ గ్రామాలకు చెందిన రైతుల పరిస్థితి ఇది. గత మూడు రోజులుగా ఒకే ప్రాంతంలో ఏనుగులు తిష్ట వేస్తూ చెరుకు, మొక్కజొన్న, కాయగూరల పంటలను నాశనం చేస్తుండడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం కూడా మరో చెరుకు తోటలో ఏనుగులు తిష్ట వేశాయి. వీటి కదలికలను గమనిస్తూ ట్రాకర్లు నిత్యం పహారా కాస్తున్నారు. కాగా ఈ ఏడు ఏనుగుల గుంపు నుండి శుక్రవారం విడిపోయిన ఒంటరి ఏనుగు వీరఘట్టం మండలం మూలలంక అటవీ ప్రాంతం వైపు వెళ్లి, అక్కడి నుండి శనివారం రాత్రి కొమరాడ మండలంలో గుణానపురం మీదుగా అర్తాం చేరుకున్నట్లు డీఆర్‌ఓ రవిబాబు తెలిపారు. ఏనుగులను చూసేందుకు పెద్ద సంఖ్యలో జనం వస్తుండడంతో వీరిలో కొందరు ఆకతాయిలు కవ్వింపు చర్యలకు పాల్పడుతుండడం ఆందోళనగా ఉందని డీఆర్‌ఓ తెలిపారు. ఏనుగులను కవ్విస్తే చాలా ప్రమాదకరమని, ఈ ప్రాంతం వైపు ఎవరూ రావద్దని ఆయన కోరారు. రాత్రి వేళల్లో సమీప గ్రామాల వారు రాకపోకలు జరపవద్దని రవిబాబు సూచించారు.



కొమరాడ: పాత గుణనపురంలో పరిసరాల్లో సంచరిస్తున్న ఒంటరి ఏనుగు

పాత గుణానపురంలో ఒంటరి ఏనుగు

కొమరాడ: ఒంటరి ఏనుగు పాత గుణానపురంలో సంచరిస్తున్నట్టు ఆదివారం అటవీ శాఖాధికారులు ప్రకటించడంతో మండల ప్రజలు మళ్లీ ఆందోళన చెందుతున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దుగ్గి, కళికోట, గుణానపురం గ్రామస్తులు రాత్రి వేళ పొలాల్లోకి వెళ్లకూడదని సూచించారు. ఒంటరిగా రహదారులపై రావొద్దని కోరారు.

తెగ మింగేస్తున్నారు..

- వైద్యుల సలహా లేకుండా యాంటీ బయాటిక్స్ వినియోగం
- జిల్లాలో 1200 మందుల దుకాణాలు
- ఏడాదికి 50 లక్షలకు పైగా మాత్రలు వాడకం
- కిడ్నీ, లివర్ వ్యాధుల బారిన పడుతున్న జనం



విజయనగరం ఫోర్ట్ :

యాంటీ బయాటిక్స్ మందులను జనం తెగ మింగేస్తున్నారు. జిల్లాలో వీటి వినియోగం బాగా పెరిగింది. చిన్నపాటి జలుబు, దగ్గు వంటి వాటికి కూడా ప్రజలు యాంటీ బయాటిక్స్ వాడుతున్నారు. కొంతమంది ఆర్‌ఎంపీలు చీటికి మాటికీ యాంటీ బయాటిక్స్ ఇవ్వడంతో గ్రామీణ ప్రాంత ప్రజలు కిడ్నీ, లివర్ వంటి వ్యాధుల బారిన పడుతున్నారు. యాంటీ బయాటిక్స్ అధిక మోతాదులో వాడడం వల్ల ప్రస్తుతం కొత్త చిక్కు వచ్చి పడింది. బాక్టీరియాలు సైతం యాంటీ బయాటిక్స్ మందులకు అలవాటు పడడంతో జ్వరాలు కూడా తగ్గక రోగులు రోజులు తరబడి మంచాన పడి మూలుగుతున్నారు. వీటి వల్ల శరీరంలో సహజ సిద్ధంగా ఉండే వ్యాధి నియంత్రణ వ్యవస్థ దెబ్బతింటుంది. ప్రమాదకర స్థాయికి యాంటీ బయాటిక్స్ వాడకం పెరిగిపోవడం వల్ల ఇప్పటికైనా నియంత్రణ చర్యలు చేపట్టాలని వైద్య నిపుణులు చెబుతున్నారు.

చిన్న రోగాలకు కూడా..

పట్టణం, పల్లె అనే తేడా లేకుండా యాంటీ బయాటిక్స్ మందులు అధికంగా వినియోగిస్తున్నారు. కొంత మంది ఆర్‌ఎంపీలు వద్ద తీసుకోగా, మరి కొంత మంది మందుల దుకాణాల వద్ద నేరుగా తెచ్చుకుని వాడుతున్నారు. జలుబు చేసినా.. దగ్గు వచ్చినా.. జ్వరం వచ్చినా.. తలనొప్పి, నడుం నొప్పి, చర్మ వ్యాధులు ఇలా ఏ జబ్బుకు అయినా యాంటీ బయాటిక్స్ తప్పనిసరిగా వాడేస్తున్నారు. వ్యాధి తీవ్రతను బట్టి యాంటి బయాటిక్స్ వాడాల్సి ఉంది. కాని చాలా మంది సొంత వైద్యం చేసుకుంటున్నారు. యాంటీ బయాటిక్స్ మందులు ఎక్కువగా వాడడం వల్ల కిడ్నీ, కాలేయ వ్యాధుల బారిన పడి మంచాన పడుతున్నారు.

జిల్లాలో 1200 మందుల దుకాణాలు

జిల్లాలో 1200 మందుల దుకాణాలు ఉన్నాయి. ఏడాదికి సుమారు 50 లక్షలకు పైగా యాంటీ బయాటిక్స్ మాత్రలు జనం వాడుతున్నారు. వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండానే మందుల దుకాణాల్లో విచ్చలవిడిగా యాంటి బయాటిక్స్ మందులు విక్రయిస్తున్నారు. కొంత మంది నేరుగా మందుల దుకాణానికి వెళ్లి అడగగానే వీటిని ఇచ్చేస్తున్నారు. రైతులు, కూలీలు, ఒళ్లు నొప్పులు వచ్చిన వారు ప్రతీ సారి డైక్లోఫినాక్ ఇంజక్షన్‌గాని లేదా యాంటీ బయాటిక్ మాత్రలుగాని మెడికల్ షాపుల్లో కొనుగోలు చేసి వాడేస్తున్నారు. వాటి వల్ల కల్గే అనర్థాలు తెలియక తాత్కాలిక ఉపశమనం కల్గడంతో వాటినే ఆశ్రయిస్తున్నారు. ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు అమ్మ కూడదన్న నిబంధన ఉన్నప్పటకి అది ఎక్కడ అమలు కావడం లేదు.

ప్రమాదమే...

నొప్పి నివారణ మందులు ఎక్కువగా వాడితే ప్రమాదమే. ఫ్లోరోసిస్ వలన నొప్పులు ఎక్కువగా ఉంటాయి. నొప్పి నివారణకు వాడే మందులు వల్ల కిడ్నీలు పాడైపోయే ప్రమాదం ఉంది. కొన్ని రకాల యాంటీ బయాటిక్స్ ఎక్కువగా వాడడం వల్ల కిడ్నీలు పాడయ్యే ప్రమాదం ఉంది. కొన్ని రకాల ఇంజక్షన్లు కిడ్నీలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. వైద్యుని సలహా లేకుండా ఎటువంటి యాంటీ బయాటిక్స్ వాడకూడదు.

– డాక్టర్ ఎస్.అప్పలనాయుడు, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

క్లుప్తంగా

డోలీలో బాలింత తరలింపు



బాలింతను డోలీలో తరలిస్తున్న ఆశావర్కర్, ఏఎన్‌ఎంలు

శృంగవరపుకోట: బాలింతను ఆస్పత్రిలో చేర్చేందుకు వైద్యారోగ్యశాఖ సిబ్బంది డోలీ కట్టి తరలించారు. శృంగవరపుకోట పంచాయతీ పరిధిలోని గిరిశిఖర గ్రామమైన గురిలోవ గ్రామానికి చెందిన గిరిజన మహిళ జన్ని మంగ శనివారం తెల్లవారుజామున గ్రామంలోనే ప్రసవించి మగబిడ్డను ప్రసవించింది. ఈ విషయం తెలిసి ఏఎన్‌ఎం పార్వతి, ఆశ వర్కర్ లక్ష్మి ఆదివారం గురిలోవ గ్రామానికి వెళ్లి ఆమె ఆరోగ్యంపై ఆరాతీశారు. బాలింత కడుపునొప్పి అని చెప్పడంతో గ్రామంలో సహాయం చేసే వారెవరూ లేకపోగా డోలీలో ఆమెను తరలించే ప్రయత్నం చేశారు. కాగా మంగ కొంత దూరం వచ్చిన తర్వాత ఆస్పత్రికి రానని చెప్పడంతో ఇంటికి చేర్చి అక్కడే వైద్యం చేశారు. కాగా గర్భిణి ముందుగా ఆస్పత్రికి ఎందుకు చేర్చలేదని, డోలీలో ఎందుకు మోయాల్సి వచ్చిందని కొట్టాం పీహెచ్‌సీ వైద్యాధికారిణి లావణ్యను వివరణ కోరగా రికార్డుల ప్రకారం జన్ని మంగకు జూన్ నెలలో డెలివరీ డేట్ ఇచ్చారని, కాగా ఇది 4వ ప్రసవం కావడంతో ముందస్తుగా ప్రసవం జరిగిందని, వైద్యాధికారిణి, తదితర సిబ్బంది సోమవారం గ్రామానికి వెళ్లి సేవలు అందిస్తారని వివరణ ఇచ్చారు.

గంజాయి కేసులో ఇద్దరి అరెస్టు

విజయనగరం క్రైమ్: స్థానిక రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో గంజాయి అమ్మకాలపై నిఘాపెట్టిన వన్‌టౌన్ పోలీసులు ఆదివారం గంజాయి అమ్ముతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి, వారి దగ్గర రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు మాట్లాడుతూ అరకు ప్రాంతం నుంచి తీసుకువచ్చిన గంజాయిని చిన్న ప్యాకెట్ల రూపంలో కట్టి, అమ్మకాలు చేస్తున్న రొంప త్రిమూర్తులు అలియాస్ నాని, వాంద్రంగి గౌరీశంకర్‌లను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామని చెప్పారు.

చెరువులో పడి వ్యక్తి మృతి



మృతి చెందిన నర్సయ్య

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని దోమాంలో ఆమదాల చెరువులో పడి అదే గ్రామానికి చెందిన ఉప్పాడ నర్సయ్య (37) మృతి చెందాడు. ఆదివారం బహిర్భూమికి వెళ్లినప్పుడు ప్రమాదవశాత్తు చెరువులో జారిపడటంతో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు. అగ్నిమాపక సిబ్బంది చెరువు వద్దకు చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి భార్య శాంతమ్మ ఫిర్యాదు మేరకు ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నర్సయ్యకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. రోజు వారి కూలీతో కుటుంబాన్ని పోషిస్తున్న వ్యక్తి మరణంతో కుటుంబ సభ్యులు పెద్దదిక్కు కోల్పోయారు.

స్పందించిన హృదయాలు



సూరమ్మకు ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలు అందజేస్తున్న దృశ్యం

సరుబుజ్జిలి : మండలంలోని షళంత్రి గ్రామానికి చెందిన అయ్యప్ప భక్తుడు గూడాల త్రినాథరావు ఇటీవల శబరిమలలో గుండెపోటుతో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో అయ్యప్ప భక్త కమిటీ, గ్రామస్తులు రూ.లక్షా 57 వేలు సేకరించి ఆదివారం విరాళంగా అందజేశారు. వైఎస్సార్ సీపీ నేత, కొత్తకోట పీఏసీఎస్ ఛైర్మన్ కొవిలాపు చంద్రశేఖర్, అయ్యప్ప కమిటీ సభ్యులు గోవిందరావు, వెంకటరావు ఆధ్వర్యంలో మృతుని భార్య సూరమ్మకు ఆమె పేరిట ఇండియన్ బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిన పత్రాలు అందించారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ మానవతా హృదయంతో స్పందించాలని దాతలు కోరారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	56,150-00
బంగారం(22సి. 10గ్రా.)	51,800-00
వెండి (కిలో)	71,200-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹107	₹184	₹ 194


పుణ్యగిరిపై భక్తసిరి

మహాశివరాత్రి వేళ జాగారం చేసిన భక్తులు ఆదివారం ముక్కంటి దర్శనం కోసం కొండదారి పట్టారు. శివ పంచాక్షరీ జపంతో పుణ్యగిరి పర్వతంపై కొలువుదీరిన ఉమాకోటిలింగేశ్వరుని దర్శించేందుకు బారులు తీరారు. శనివారం పుణ్యగిరి క్షేత్రం భక్తులతో పులకించగా, ఆదివారం మధ్యాహ్నం వరకూ మెట్ల మార్గంలో భక్తులు వేలసంఖ్యలో 'హర హర మహదేవ'' అంటూ కదిలారు.

–శృంగవరపుకోట



పుణ్యగిరికి తరలుతున్న భక్తులు



ధారగంగమ్మ లోయలో భక్తుల కోలాహలం



మెట్ల మార్గంలో తరలుతున్న భక్తులు



ఉమాపతికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

- వేలాదిగా వచ్చిన భక్తులు
- ప్రశాంతంగా ముగిసిన జాతర

పుణ్యగిరి క్షేత్రంలో శనివారం తెల్లవారుజామున ప్రారంభమైన దర్శనాలు ఆదివారం సాయంత్రం వరకూ నిరంతరాయంగా కొనసాగాయి. పుణ్యగిరికి శివరాత్రిరోజు వచ్చే భక్తులసంఖ్య కన్నా, జాగరణ చేసి మర్నాడు వచ్చే భక్తుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. ఈ ఏడాది శనివారం శనిత్రయోదశి, మహాశివరాత్రి, మాసశివరాతత్రి కావడంతో తొలిరోజునే భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. తూర్పుగోదావరి, విశాఖ, శ్రీకాకుళం, ఒడిశా నుంచి, భక్తులు తరలివచ్చారు. పుట్టుధార, ధారగంగమ్మ లోయల్లో స్నానాలు చేసేందుకు, భక్తులు తోపులాడుకున్నారు. భక్తులను తరలించేందుకు ఆర్టీసీ నిరంతరాయంగా బస్సులు నడిపి సేవలందించింది. పోలీసులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, వైద్యారోగ్యశాఖ సిబ్బంది, ఆర్టీసీ, పంచాయతీరాజ్. దేవాదాయశాఖ ఉద్యోగులు నిరంతరాయంగా సేవలు అందించారు.

ముక్కంటిని దర్శించిన ఎమ్మెల్యే

పుణ్యగిరిలో ఉమాపతిని స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం, ట్రస్టుబోర్డు ఛైర్మన్ పి.రామకృష్ణ, ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికి, గర్భాలయంలో పూజలు చేయించారు. శనివారం రాత్రి లింగోద్భవ సమయంలో ఎమ్మెల్సీ రఘురాజు దంపతులు, ఎంపీపీ సోమేశ్వరరావు, జెడ్పీటీసీ వెంకటలక్ష్మి, సర్పంచ్ సంతోషికుమారి తదితరులు పుణ్యగిరిలో ఉమాపతిని దర్శించారు.

భక్తజన ఘోషతో పులకించిన సానువులు

ఆదివారం రాత్రి లింగోద్భవ సమయంలో అర్చకులు స్వామికి పంచామృతాభిషేకం, మహన్యాసపూర్వకంగా రుద్రాభిషేకం చేస్తూ భక్తులకు దర్శనాలు కల్పించారు. హర..హర..మహదేవ, ఓం నమఃశివాయ అంటూ భక్తులు చేసిన నామజపంతో పుణ్యగిరి సానువులు పులకించాయి. భక్తుల సౌకర్యార్థం ఉచితం, శీఘ్ర, విశిష్ట దర్శనాలు కల్పించారు. పుణ్యగిరి మెట్ల మార్గంలో చిలక ప్రశ్నగాళ్లు, జంగమదేవర్లు, దాసర్లు, తోటపుఎద్దులు, భజన బృందాలు, చిల్లర దుకాణాలు, బొమ్మల వ్యాపారులు, కంచర సామగ్రి, ఇనుప వస్తువులు, ఇలా రకరకాల దుకాణాలతో పుణ్యగిరి జాతర భక్తులను అలరించింది.



పుణ్యగిరిలో ఆర్టీసీ సేవలు



పుణ్యగిరిలో ప్రధానాలయం వద్ద క్యూలో భక్తులు



పుట్టుధార వద్ద స్నానాలు చేస్తున్న భక్తులు

సమన్వయంతో సేవలు

దేవాదాయ, పోలీస్, ఆర్టీసీ, విద్యుత్, వైద్యారోగ్యశాఖ, పంచాయితీరాజ్ శాఖలు ఏర్పాటు చేసిన విశ్రాంతి షెల్టర్లలో పుణ్యగిరి జాతరకు వచ్చిన భక్తులు సేదతీరారు. భక్తులకు లడ్డూ, పులిహోర ప్రసాదాలు అమ్మకాలు చేశారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు అవకాశం తావివ్వకుండా చర్యలు తీసుకోవడంతో పుణ్యగిరి జాతర ప్రశాంతంగా ముగిసింది. పంచాయతీ సిబ్బంది రోడ్లు తడుపుతూ, చెత్తా, చెదారం తుడుస్తూ, పారిశుధ్యం పక్కాగా అమలు చేశారు. పుణ్యగిరిలో సీసీ కెమెరాల నిఘాలో పోలీసులు పర్యవేక్షణ చేశారు. అలాగే పుణ్యగిరికి తరలివచ్చిన భక్తులకు స్థానిక స్వచ్ఛంద సంస్థలు, సంఘాలు ఆకలి దప్పులు తీర్చాయి. ఆదివారం ఉదయం నుంచి పుణ్యగిరి మార్గంలో రోడ్డుకి రెండువైపులా పులిహోర, చక్కెర పొంగలి. పరమాన్నం, పుచ్చకాయలు, టాటా గ్లూకోజ్, వాటర్ ప్యాకెట్లు, భోజనాలు ఏర్పాటు చేసి భక్తులకు ఆకలి తీర్చారు.

షటిల్ టోర్నమెంట్ విజేత ఎస్.కోట

- ద్వితీయ, తృతీయ స్థానాల్లో శ్రీకాకుళం, కాకినాడ
- నగదు బహుమతులు అందజేసిన నిర్వాహకులు



ప్రథమ స్థానంలో నిలిచిన ఎస్.కోట జట్టుకు నగదు బహుమతి అందజేస్తున్న ఎంపీ తనయుడు వంశీకృష్ణ

చీపురుపల్లి: ఉత్తరాంధ్ర స్థాయిలో నిర్వహించిన షటిల్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. విజయనగరం పార్లమెంట్ సభ్యుడు బెల్లాన చంద్రశేఖర్ జన్మదినోత్సవం సందర్భంగా చీపురుపల్లి పట్టణంలోని బెల్లాన సింహాచలం వెల్ఫేర్ అసోసియేషన్ ఇండోర్ స్టేడియంలో ఉత్తరాంధ్ర స్థాయి షటిల్ టోర్నమెంట్ శనివారం నిర్వహించారు. ఈ పోటీలకు 54 జట్లు హాజరయ్యాయి. ఉత్కంఠ భరితంగా సాగిన ఈ పోటీల్లో ఎస్.కోటకు చెందిన దినేష్, ఆదిత్యల జట్టు ప్రథమ స్థానంలో నిలవగా రూ.10 వేలు, శ్రీకాకుళానికి చెందిన మనోహర్, సాయిల జట్టు ద్వితీయ స్థానంలో నిలవగా రూ.8 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన కాకినాడకు చెందిన అప్పారావు, రాజేష్‌ల జట్టుకు రూ.6 వేలు నగదు బహుమతి ప్రదానం చేశారు. ఎంపీ తనయుడు బెల్లాన వంశీకృష్ణ, అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.సన్యాసిరావులు నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో శరత్, స్వరూప్, వేణు తదితరులు పాల్గొన్నారు.

మూడేళ్లుగా మంచానికే పరిమితం

- అనారోగ్యంతో బాధపడుతున్న గిరిజన యువతి
- వైద్యం చేయించే స్థోమత కరువు
- దాతల సాయం కోసం ఎదురు చూపు



మంచానికే పరిమితమైన మణి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కుక్కిడి పంచాయతీ రుషికాలనీలో ఓ నిరుపేద గిరిజన కుటుంబం దాతల సాయం కోసం అభ్యర్థిస్తోంది. కాలనీకి చెందిన బిడ్డిక తెలుంగు, కళావతిల కుమార్తె మణి(20) కరోనా ప్రారంభ సమయంలో కాళ్లుచేతుల నొప్పులతో బాధపడుతూ విశాఖపట్నంలోని కేజీహెచ్‌కు వెళ్లి వైద్యసేవలు పొందింది. అయినప్పటికీ నయం కాకపోవడం, కరోనా విజృంభించడం వంటి కారణాలతో పాటు ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్య సేవలందించే స్థోమత లేకపోవడం వల్ల తల్లిదండ్రులు ఇంటికి తీసుకొచ్చేశారు. అప్పటినుంచి కూర్చోలేక, కాళ్లుచేతులు కదపలేక మూడేళ్లుగా ఆ యువతి మంచానికే పరిమితమైంది. బహిర్భూమి వంటి కాలకృత్యాల కోసం ఇద్దరు వ్యక్తులు ఎత్తుకుని తీసుకెళ్లాల్సిన పరిస్థితి. ఒక్కో ఇంజక్షన్ రూ.25వేల చొప్పున కనీసం రూ.2, రూ.3 లక్షల వరకు వెచ్చిస్తే ఆ యువతి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నప్పటికీ, అంతమాత్రం వెచ్చించే పరిస్థితి లేకపోవడంతో నిరుపేదలైన తల్లిదండ్రులు దాతల సాయం కోసం అభ్యర్థిస్తున్నారు. ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న కూతురు తమ బీదరికం వల్ల కళ్లముందే కృశించుకుపోతోందని దాతలెవరైనా ముందుకు వచ్చి సాయం అందించాలని కోరుతున్నారు. వివరాల కోసం ఫోన్ 8500106167 నంబర్‌కు సంప్రదించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

శిశువుల ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ

- ఇమ్యునైజేషన్ జిల్లా అధికారి డాక్టర్ టి. జగన్‌మోహన్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఐఓ టి. జగన్‌మోహన్‌రావు

పార్వతీపురంటౌన్: శిశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ, ఆరోగ్య కార్యక్రమాలన్నీ పక్కగా జరిగేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) డాక్టర్ టి. జగన్‌మోహన్‌రావు చెప్పారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శిశు ఆరోగ్యంపై వైద్యారోగ్యశాఖ సూచనలు పాటిస్తూ ఎప్పటికప్పుడు వారికి సంబంధించిన అన్ని ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలు పూర్తిస్థాయిలో అమలు జరిగేలా, చిన్నారులకు వైద్య సేవలు, వైద్య సదుపాయం వినియోగపడేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బిడ్డ పుట్టినప్పటి నుంచి షెడ్యూల్ ప్రకారం వ్యాధినిరోధక టీకాల నిర్వహణ అటు క్షేత్రస్థాయిలో ఇటు ఆరోగ్య కేంద్రాల్లో, ముందస్తుగానే ఆ పరిధిలో ఆ తారీఖున ఉండే టీకా అర్హుల జాబితాను సిద్ధం చేసుకుని వారికి తెలియజేస్తూ, వాటి ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. నవజాత శిశువుల ఆరోగ్యం దృష్ట్యా ఎప్పటికప్పుడు గృహసందర్శన ద్వారా ఆరోగ్య పర్యవేక్షణ, అందుకోసం ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హెచ్‌బీఎన్‌సీ కిట్లను ఉపయోగించి ఏవైనా అనారోగ్య లక్షణాలు గుర్తించిన వెంటనే వైద్యుల దృష్టికి తీసుకువెళ్తున్నట్లు చెప్పారు.

శ్వాస సంబంధ సర్వే పూర్తి

చిన్నారుల్లో న్యుమోనియా, ఇతర శ్వాసకోశ సంబంధమైన అనారోగ్య లక్షణాలు గుర్తించి, నివారించే దృష్ట్యా వైద్య ఆరోగ్య శాఖ ప్రవేశపెట్టిన సర్వే ద్వారా వైద్య సిబ్బంది ఇప్పటికే ఐదు సంవత్సరాల లోపు పిల్లల ఆరోగ్యంపై సర్వే దాదాపుగా పూర్తి చేశారని, అనారోగ్య లక్షణాలు గుర్తించిన వారికి అవసరమైన మందులు, చికిత్స అందజేస్తున్నట్లు తెలిపారు. చిన్నారుల్లో రక్తహీనత నివారణకు వారానికి రెండు సార్లు ఐరన్ సిరప్‌లు ఇస్తున్నామని, అదేవిధంగా అంగన్వాడీ కేంద్రాలను ఎప్పటికప్పుడు సందర్శించి పిల్లల ఆరోగ్యంపై పర్యవేక్షణ చేస్తూ పౌష్టికాహార లోపం, ఎదుగుదల లోపం గల పిల్లలను గుర్తిస్తే వెంటనే సంబంధిత ఎన్‌ఆర్‌సీ కేంద్రాలకు రిఫర్ చేస్తున్నామన్నారు. హైరిస్క్ గర్భిణులను ప్రసవ తేదీకి ముందుగానే నిర్దేశించిన ఆస్పత్రిలో అడ్మిట్ చేయడం ద్వారా అత్యవసర వైద్యసేవలు అందుబాటులో ఉంటూ మాతృ, శిశు మరణాలు సంభవించకుండా జాగ్రత వహిస్తున్నట్లు వివరించారు. శిశువుకు అవసరమయ్యే అత్యవసర వైద్య సేవల కేంద్రాలు ఎస్‌ఐసీయూ, ఎస్ఎన్‌సీయూ అందుబాటులో ఉన్నాయన్నారు. చిన్నారుల ఆరోగ్య కార్యక్రమాల నిర్వహణపై వైద్య శాఖ, ఐసీడీఎస్ శాఖ సమన్వయంతో సమావేశాలు నిర్వహిస్తూ ప్రగతి నివేదికలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అటు తల్లిదండ్రులు కూడా పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ, వైద్యులు, సిబ్బంది సూచనలను పాటించాలని కోరారు.

ముగిసిన మహాశివరాత్రి ఉత్సవాలు

- లక్షమందికి పైగా తరలివచ్చిన భక్తజనం
- బందోబస్తు నిర్వహించిన పోలీస్ శాఖ





రామకోనేరు వద్ద భక్తుల రద్దీ (ఇన్‌సెట్లో) ప్రత్యేక అలంకరణలో ఉమా సదాశివస్వామి

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. రెండు రోజుల పాటు సాగిన ఈ జాతరలో సుమారు లక్షమందికి పైగా భక్తులు శివకేశవులను దర్శించుకున్నట్లు అంచనా. ఆలయ ప్రాంగణం, కల్యాణమంటపం, బోడికొండ తదితర ప్రాంతాలు భక్తులతో కిక్కిరిసాయి. అలాగే సమీపంలో గల నీలాచలం బోడికొండ, రామస్వామి వారి ఆలయం, కోనేరు గట్టు తదితర ప్రాంతాల్లో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి తరలివచ్చిన భక్తులు ముందు రోజు రాత్రంతా జాగారాలు చేసి ఉదయాన్నే రామకోనేరులో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం శ్రీ సీతారామస్వామివారిని, పక్కనే ఉన్న ఉమాసదాశివ స్వామివారిని అత్యంత భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు. అర్ధరాత్రి 12గంటలకు ఉమా సదాశివాలయంలో లింగోద్భవ పూజలు వైభవంగా జరిగాయి. ఆ సమయంలో స్వామిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో పోటీపడ్డారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భోగాపురం, పూసపాటిరేగ, లావేరు, రణస్థలం, భీమిలి, విశాఖపట్నం తదితర ప్రాంతాల నుంచి మత్స్యకారులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి ప్రతిమను మధ్యలో ఉంచి చుట్టూ వృత్తంలా ఏర్పడి సంప్రదాయబద్ధంగా నృత్యాలు చేశారు. అలాగే బోడికొండపై ఉన్న చారిత్రక ఆధారాలను చూడడానికి అధిక సంఖ్యలో సందర్శకులు తరలివెళ్లారు. ఎంపీపీ అంబళ్ల సుధారాణి, సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యుడు అంబళ్ల శ్రీరాములు నాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, డీసీసీబీ వైస్ ఛైర్మన్ చనమల్లు వెంకటరమణ, టూరిజం బోర్డు రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు తదితరులు ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు.

పోలీసుల సేవలు భేష్

మహాశివరాత్రి జాతరలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సుమారు 300 మంది పోలీసులు గస్తీ నిర్వహించారు. ఎస్పీ దీపికా పాటిల్ ఆధ్వర్యంలో డీఎస్పీతో పాటు ఆరుగురు సీఐలు మహాశివరాత్రి బందోబస్తును పర్యవేక్షించారు. డ్రోన్ కెమెరాలతో భక్తుల రద్దీని చిత్రీకరించి అల్లరిమూకలపై దృష్టి సారించారు. క్యూల వద్ద తోపులాట జరగకుండా పర్యవేక్షించారు. మిమ్స్ మెడికల్ కళాశాల, సతివాడ, కొండవెలగాడ పీహెచ్‌సీ సిబ్బంది వైద్యసేవలు అందించారు. వివిధ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ వలంటీర్లు అంకితభావంతో సేవలందించారు.

దళిత కథా సంకలనంలో 'చంద్రయ్య'

పలాస: మండలంలోని రంగోయి గ్రామానికి చెందిన జానపద పరిశోధకుడు, రచయిత, తెలుగు భాషోద్యమ సమాఖ్య కేంద్ర కమిటీ సభ్యుడు బద్రి కూర్మారావు రాసిన 'చంద్రయ్య' కథకు దళిత కథా సంకలనంలో చోటు లభించింది. అరుణ గోగులమండ, మానస ఎండ్లూరు సంపాదకత్వంలో తెలంగాణ భాషా సంస్కృతి శాఖ ముద్రించిన 'ముళ్ళ చినుకులు' కథా సంపుటిలో చంద్రయ్య కథకు చోటు దక్కింది. ఆంధ్రా ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో 'ఊరి కాపరి'గా ఉన్న దండాశి కులస్తుల ఇతివృత్తాన్ని తీసుకొని కూర్మారావు ఈ కథ రాశారు. ఇటీవలే హైదరాబాద్, విజయవాడలో కథా సంకలనాన్ని ఆవిష్కరించారు. కాగా, ఈ నెల 21న అంతర్జాతీయ భాషా దినోత్సవం విజయవాడ పి.బి.సిద్ధార్థ కళాశాలలో జరుగుతుందని కూర్మారావు తెలిపారు. మాతృభాషల పరిరక్షణ సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

డీపీఎల్ క్రికెట్ టోర్నీ విజేత సారవకోట



విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య తదితరులు

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శివరాత్రి సందర్భంగా నిర్వహించిన ధర్మాన ప్రీమియర్ లీగ్ సీజన్ -4 క్రికెట్ టోర్నమెంట్ విజేతగా సారవకోట జట్టు నిలిచింది. ఆదివారం వేకువజామున జరిగిన ఫైనల్లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఆర్ఎస్‌సీఏ నరసన్నపేట జట్టు 8 ఓవర్లలో 47 పరుగులు చేసింది. 48 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన సారవకోట జట్టు 7.2 ఓవర్లలో లక్ష్యం ఛేదించింది. విజేతగా నిలిచిన సారవకోట జట్టుకు పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య, సర్పంచ్ బూరల్లి శంకర్‌లు ట్రోఫీ, నగదు బహుమతి అందించారు. మ్యాన్‌ఆఫ్ ద సిరీస్‌గా ఎండీ బాబు, బెస్ట్ బ్యాట్స్‌మేన్‌గా సారవకోటకు చెందిన కశ్యప్, బెస్ట్ బౌలర్‌గా ప్రేమకుమార్ అవార్డులు అందుకున్నారు. అల్లంశెట్టి రవి, కె.సింహాచలం, ఎస్.రాము అంపైర్లుగా వ్యవహరించారు. రాక్‌స్టార్ క్రికెట్ అసోషియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు చీపురు కృష్ణ, ప్రసాద్, దండి జయప్రకాష్, రమణ సాహూ, డేవిడ్, బోయిన బాలకృష్ణ, గనగళ్ల శ్రీను, అసోసియేషన్ ప్రతినిధులు రాము తదితరులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

గార: శ్రీకూర్మం పంచాయతీ సెగిడిపేట గ్రామానికి చెందిన జగ్గుపిల్లి నాగు అదే గ్రామ సమీపంలోని ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. తొలుత రిమ్స్‌కు తరలించగా పరిస్థితి విషమించడంతో విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. కాలును తొలగించగా చికిత్స జరుగుతోంది. ఏఎస్ఐ లక్ష్మణరావు కేసు నమోదు చేశారు.

కవితా నిలయం లోగో ఆవిష్కరణ



లోగో ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని శాంతినికేతన్ జూనియర్ కళాశాలలో ఆదివారం కవితా నిలయం నెలవారీ కార్యక్రమంలో భాగంగా సాహితీ సమీక్ష జరిగింది. ముందుగా డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కవితా నిలయం లోగో ఆవిష్కరించారు. అనంతరం వావిలపల్లి రాజారావు రచించిన మహోన్నత శిఖరాలు(శతాధిక కవితామాలిక) పుస్తకంపై సమీక్ష నిర్వహించారు. సదరు పుస్తకాన్ని కవితా నిలయానికి బహూకరించారు. కార్యక్రమంలో కవితా నిలయం అధ్యక్షుడు ఈవేమన, గౌరవ అధ్యక్షుడు సురంగి మోహనరావు, ప్రధాన కార్యదర్శి ఉమాకవి, కార్యదర్శి సంతోష్, నవలా రచయిత కె.రంగనాయకులు, మహిళా కార్యదర్శి తేజస్విని పాల్గొన్నారు.